ఎన్నికల అధికారుల తనిఖీ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను అధికారులు తనిఖీ చేశారు. బుధవారం సరిహద్దులోని చెక్‌పోస్టులను కోలారు లోక్‌సభ ఎన్నికల అధికారి, జిల్లా అధికారి అక్రంపాషా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అవసరమైన ర్యాంప్‌లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లా ఇన్‌చార్జ్ అధికారి శంకర్‌నాయక, జావేద్, నాసింఖానం, స్వీప్ సమితి అధ్యక్షుడు మునిరాజు, తహసీల్దారు బీఎన్ స్వామి, బీఓ నరేంద్రకుమార్, అక్షర అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అంతా రామమయం..


అలంకరణలో బసవనపుర అభయాంజనేయస్వామి ఆలయం


ఊరేగింపులో సీతారాములు..

స్వామి దర్శనం ఇలా..


ప్రసాదాల పంపిణీ



రాష్ట్రమంతా రామనామం మార్మోగింది..జై శ్రీరామ్..జై శ్రీరామ్ నినాదాలతో భక్తి భావం ఉప్పొంగింది. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఊరూరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరుపుకున్నారు. కోదండరాముడి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అభిషేకం, అర్చనల అనంతరం భక్తులకు వడపప్పు.. పానకం అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.

శివాజీనగర్‌లో





ఆలయాల వద్ద భక్తుల సందడి



ప్రజాస్వామ్య పరిరక్షణకే ప్రాధాన్యం


మండ్య సభలో రాహుల్‌గాంధీ,సిద్దరామయ్య, డీకే శివకుమార్

- అసమానతలు తొలగాలంటే కాంగ్రెస్ పాలన రావాలి
- మోదీకి కార్పొరేట్లు తప్ప సామాన్యులు కానరారు..
- ప్రచారంలో రాహుల్ గాంధీ

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య రక్షణే కాంగ్రెస్ లక్ష్యమని, దేశంలో అసమానతను తొలగించడమే మా పార్టీ విధానమని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వెల్లడించారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండ్య కోలారు జిల్లా మాలూరు బహిరంగసభలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. ప్రత్యేక విమానంలో హెచ్ఏఎల్ విమానాశ్రయం చేరుకున్న రాహుల్‌ను సీఎం సిద్దరామయ్య సాదరంగా స్వాగతించారు. అక్కడనుంచి రాహుల్‌గాంధీతో కలసి సిద్దరామయ్య మండ్యకు వెళ్లారు. మండ్యలో అభ్యర్థి వెంకటరమణగౌడ అలియాస్ స్టార్ చంద్రు తరఫున ప్రచారం చేశారు. మేం అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ కల్పిస్తామని, పంటలకు గిట్టుబాటుధరలు అమలు చేస్తామని, దేశంలో పేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు గ్యారెంటీ అన్నారు. మాకు అసమానత లేని, శోషణలేని భారత్ కావాలన్నారు. ప్రధాని మోదీ కోట్లాది రూపాయలను అదానీ, అంబానీలకు ఇస్తున్నారని అయితే మేం దేశంలోని పేద మహిళలకు ఇవ్వదలిచామన్నారు. దేశంలోని ప్రతి మహిళకు రూ.8,500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. కులగణన అమలు చేస్తామన్నారు. రుణమాఫీ చేస్తామంటే రైతులను దారి తప్పిస్తారని బీజేపీ నేతలు ఆరోపిస్తారన్నారు. అయితే శ్రీమంతులకు లక్షల కోట్లు మాఫీ చేశారన్నారు. దేశంలో మీడియా 24 గంటలపాటు మోదీ ముఖం చూపుతుందని, క్రికెటర్‌లను చూపుతారని కానీ పేదలు, రైతులు, కార్మికుల కష్టాలు చూపరన్నారు. కులగణన అంశంపై మోదీ నోరు తెరవరని, సమ్మతిస్తున్నారో వ్యతిరేకిస్తున్నారో తెలియదన్నారు. కర్ణాటకతో తమ కుటుంబానికి అవినాభావ సంబంధమన్నారు. నాన్నమ్మ ఇందిరాగాంధీ చిక్కమగళూరునుంచి గెలిచారని, తల్లి సోనియాగాంధీ ఇక్కడనుంచే విజయం సాధించారన్నారు. అవ్వతోపాటు కేజీఎఫ్‌లో బంగారు గనులు చూసేందుకు వచ్చానని, అక్కడి కార్మికులతో మాట్లాడానని బంగారు నిధులను చూశానన్నారు. అయితే ఆ కార్మికులు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. దేశంలో 22మంది శ్రీమంతులకు రూ.17లక్షలకోట్లు రుణమాఫీ చేశారని ఈ విధానం సరికాదన్నారు. దేశంలో 22మంది వద్ద ఉండే సొమ్ము 70కోట్లమందితో ఉండే సొమ్ముకు సమానమన్నారు. ముంబై ఎయిర్‌పోర్ట్ యజమానిపై సీబీఐ కేసు వేసి అదానీకి ఇప్పించారన్నారు. దేశంలో 15శాతం దళితులు, 8శాతం గిరిజనులు, 50శాతం బీసీలు, 15శాతం మైనారిటీలు ఉన్నారని ఏ శాఖకు వెళ్లినా వీరి ప్రాతినిథ్యమే లేదన్నారు. దేశంలో ప్రముఖమైన 200 కంపెనీల జాబితాను చూస్తే ఎస్సీ, బీసీ, మైనారిటీలు లేరన్నారు. దేశంలో 90మంది ఐఏఎస్ అధికారుల జాబితా చూస్తే ముగ్గురు బీసీలు, ముగ్గురు దళితులు ఉన్నారన్నారు. దేశంలో అసమానత తొలగాలంటే మార్పు అవసరమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మాలూరు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ బీజేపీని ఓడిస్తేనే దేశంలో మార్పు సాధ్యమన్నారు. ప్రధాని మోదీ ఇటీవలే మైసూరుకు వచ్చారని 30 నిమిషాలు మాట్లాడితే ఐదు నిమిషాలు అభివృద్ధి గురించి మాట్లాడి మిగిలిన సమయమంతా కాంగ్రెస్‌నూ దూషించేందుకే కేటాయించారన్నారు. మోదీ కర్ణాటకకు ఇచ్చిన ప్రత్యేకత ఏదో బహిరంగ పరచాలన్నారు. కరువు వచ్చినప్పుడు, వరదల వేళ కనిపించలేదని, ఎన్నికలకోసం ఎప్పుడూ వస్తుంటారన్నారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీ వాటాలు, ఎన్‌డీఆర్ఎఫ్ సాయంపై సీఎం సిద్దరామయ్య గణాంకాలతో పాటు బహిరంగం చేస్తే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ సమాధానం ఇవ్వలేదన్నారు. కోలారు అభివృద్ధికి చెరువులకు నీరు మళ్లించడం ద్వారా సాధ్యమైందన్నారు. మేం అధికారంలోకి వస్తే 5 న్యాయాలు, 25 గ్యారెంటీలు ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంతటి వాస్తవమో మండ్యలో కాంగ్రెస్ గెలుపు అంతే అన్నారు. ప్రజాధ్వనికి ప్రజలు ప్రత్యేకంగా ఆదరిస్తున్నారన్నారు. కుమారస్వామి రామనగర జిల్లా ఎమ్మెల్యే అని బెంగళూరు గ్రామీణ నుంచే పోటీ చేయవచ్చునని కానీ ఓడిపోతామనే మండ్యకు వచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కానీ పేదలకు బియ్యం ఇచ్చేందుకు కేంద్రం అడ్డుపడిందన్నారు. భావనాత్మక అంశాలతో రాజకీయం సరికాదన్నారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, కార్యాధ్యక్షుడు తన్వీర్‌సేఠ్, మంత్రి చలువరాయస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాలూరు సభలో మల్లికార్జున ఖర్గే, డీకే శివకుమార్

సివిల్స్‌లో సత్తా చాటిన కన్నడిగులు

- రాష్ట్రవ్యాప్తంగా 25 మందికి ఉత్తమ ర్యాంకులు


తల్లిదండ్రులతో 100వ ర్యాంకు విజేత హాసమని


సౌభాగ్య ఎస్ బీళగి మఠ (101ర్యాంకు) కృపాజైన్ (404ర్యాంకు)

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాల్లో 25మంది కన్నడిగులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో విజయపుర జిల్లా దేవరహిప్పరగి తాలూకా విజేతా హాసమని 100వ ర్యాంకు సాధించి రాష్ట్రంలో టాపర్‌గా నిలిచారు. ధారవాడ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ చదివిన దావణగెరె నివాసి సౌభ్యా బీళగిమఠ 101వ ర్యాంకును సాధించగా, కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా తిమ్మనాయకనహళ్ళి నాగేంద్రబాబు కుమార్ 160వ ర్యాంకును సాధించారు. హాసన్ జిల్లా చన్నరాయపట్టణ తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన శశాంక్ ఎస్ఎం 459 వ ర్యాంకును, మైసూరు జిల్లా పెరియపట్టణ తాలూకా కుడకూరుకు చెందిన కేటీ మేఘన 721వ ర్యాంకును సాధించారు. న్యూఢిల్లీలో ఐఐఎస్‌లో పనిచేస్తున్న మేఘన మంచి ర్యాంకు కోసం మరోసారి ప్రయత్నిస్తానన్నారు. కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా భీమగానహళ్ళికి చెందిన డాక్టర్ వివేక్‌రెడ్డి 741వ ర్యాంకును సాధించారు. ఇతను ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 2019లో 480వ ర్యాంకుతో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. మైసూరు జిల్లా హుణసూరు తాలూకా తిమ్మలాపుర గ్రామానికి చెందిన ఎం లేఖన్ 777 ర్యాంకును సాధించారు. బళ్ళారి జిల్లా కురుగోడు తాలూకా హొసగెణకహాలు గ్రామానికి చెందిన శాంతప్ప కురుబూర 644 ర్యాంకును సాధించారు. ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా ఆలనహళ్ళికి చెందిన తేజస్విని 787వ ర్యాంకును సాధించారు. శివమొగ్గకు చెందిన ఐఎన్ మేఘన 589వ ర్యాంకును సాధించారు. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన మేఘన 2022లో 617వ ర్యాంకును సాధించి మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన కేఎల్ సూరజ్ 713వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ప్రస్తుతం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అనుబంధంగా బెంగళూరు ఎయిర్ పోర్ట్‌లో ఇమ్మిగ్రేషన్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. బీదర్ జిల్లా బసవకల్యాణకు చెందిన శివాజీనగర్ కాలనీ వాసి లఖన్‌సింగ్ దిల్‌దార్‌సింగ్ రాథోడ్ 756వ ర్యాంకును సాధించారు. మైసూరు జిల్లా బెళవాడికి చెందిన జే భానుప్రకాశ్ 600వ ర్యాంకును సాధించారు. ఇతను ఎంబీబీఎస్ ఎండీ చేశారు. హుబ్బళ్ళికి చెందిన కృపా జైన్ 440వ ర్యాంకును సాధించారు. బీదర్ జిల్లా గోళఖాన్ నివాసి మహ్మద్ అసీన్ ముజ్జా బా 481వ ర్యాంకును సాధించారు. ప్రస్తుతం ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉన్నారు. మండ్య జిల్లా మళవళ్ళి తాలూకా అటవీ సరిహద్దు గ్రామం బీరూటకు చెందిన బీఎస్ చందన్ 731వ ర్యాంకును సాధించారు. చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా హళ్ళదామదహళ్ళి నివాసి హెచ్ఆర్ ప్రమోద్ ఆరాధ్య 671వ ర్యాంకును సాధించారు. ప్రమోద్ 2021లో 601వ ర్యాంకును సాధించి ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ (ఐసీఏఎస్)లో శిక్షణ పొందుతున్నారు. కోలారు జిల్లా శ్రీనివాసపుర పట్టణానికి చెందిన డాక్టర్ గౌతమ్ 939వ ర్యాంకును సాధించారు. 2021లో ఎంబీబీఎస్ పూర్తి చేసి గ్రూప్స్‌కోసం సిద్ధమయ్యారు. యూపీఎస్సీ పరీక్షల్లో రాష్ట్రం నుంచి 28మందిలో బెంగళూరులోని ఇన్‌సైట్స్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందినవారు 20మంది ఉన్నారని ఫౌండర్ వినయ్‌కుమార్ జీబీ హర్ష ప్రకటించారు. 2014 నుంచి ఇప్పటివరకు 150మంది అర్హత సాధించారన్నారు. కాగా విజయనగర్‌లోని యూనివర్సల్ కోచింగ్ సెంటర్‌నుంచి శిక్షణ పొందిన 18మంది అర్హత సాధించినట్లు సంస్థ ఛైర్మన్ ఉపేంద్రశెట్టి సంతోషం వ్యక్తం చేశారు.

ఆస్తి కోసం 9ఏళ్ల బాలికను కిడ్నాప్ చేశారు

- డీకేపై మాజీ ప్రధాని దేవెగౌడ ఆరోపణలు

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బిడది సమీపంలో రోడ్డు పక్కన ఉండే ఆస్తిని రాయించుకునేందుకు 9ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసిన వారికి ఓటేస్తారా.. అంటూ డీసీఎం డీకే శివకుమార్‌పై పరోక్షంగా మాజీ ప్రధాని దేవెగౌడ ఆరోపించారు. బుధవారం ఉడుపి నియోజకవర్గం మైత్రి అభ్యర్థి కోట శ్రీనివాసపూజారికి మద్దతుగా ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే సందర్భంగా దేవెగౌడ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం అయ్యాయి. ఒక్కలిగలు తనను బలపరచాలని డీకే శివకుమార్ కోరడంపై దేవెగౌడ మండిపడ్డారు. నిన్ను ఎందుకు బలపరచాలని ప్రశ్నించారు. 9ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి ఆస్తులు రాయించుకున్నందుకా..? అంటూ నిలదీశారు. అమెరికాలో సంపాదించిన ఓ పారిశ్రామికవేత్త బిడది వద్ద ఓ ఐటీ కంపెనీ స్థాపించేందుకు సిద్ధమయ్యారన్నారు. ఒక్కరోజు ముందే తప్పుడు పత్రాలను సిద్ధం చేసుకుని వాటి ద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లారని, రెండు చోట్ల ఎదురుదెబ్బ పడిందన్నారు. కానీ సదరు పారిశ్రామికవేత్త కుమార్తెను గంగమ్మతిమ్మయ్య కల్యాణమండపం పక్కన ఓ ఇంట్లో 9 రోజులపాటు బంధించారన్నారు. ఆస్తి పత్రాలపై సంతకం చేసి మీ కుమార్తెను తీసుకెళ్లాలని బెదిరించారని ఇటువంటివారిని బలపరచాలా అంటూ ప్రశ్నించారు. ఆ ఇంటికి తండ్రి చేరుకున్నాక బాలిక కళ్లకు కట్టిన గంతలు తొలగించారని, ఆ చిన్నారి తండ్రిని చూసి ఒక్కసారిగా పరుగు తీసి అక్కున చేరిందన్నారు. ఈ విషయాన్ని తనకు ఓ లాయర్ తెలియజేశారన్నారు. అతడి పేరు మరచిపోయానని అయితే ఓ ఐటీ పరిశ్రమ పెట్టాలని భావించిన వ్యక్తి జీవనం కోసం మరో చోటు పనిచేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.



గుర్రానికి గ్లాండర్స్..



- డీజేహళ్ళి పరిధిలో 5కిలోమీటర్ల మేర రెడ్‌జోన్
- పశుపోషకులు జాగ్రత్త వహించాలి
- ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవరజీవనహళ్ళి (డీజే హళ్ళి) పరిధిలో ఓ గుర్రానికి ప్రాణాంతకమైన గ్లాండర్స్ జబ్బు నిర్ధారణ అయ్యింది. ఇదో ప్రాణాంతకమైన వైరస్ అని పశుసంవర్ధకశాఖ గుర్తించింది. డీజే హళ్ళిలోని ఖలీద్ షరీఫ్ అనే వ్యక్తికి చెందిన గుర్రానికి గ్లాండర్స్ జబ్బు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించామన్నారు. ఈమేరకు ఐదు కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా పరిగణిస్తున్నట్లు తెలిపారు. 5-25 కిలోమీటర్ల మేర ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశువులకు రక్షణ చర్యలు కొనసాగించాలని సూచించారు. గ్లాండర్స్ అనే వైరస్ ప్రాణాంతకమైనది. ఇది సాధారణంగా గుర్రాలు, గాడిదలకు ప్రబలుతుంది. ఇదో జెనెటిక్ జబ్బు కాగా బుర్కేల్ దేరియా మల్లి అనే బ్యాక్టీరియా నుంచి ప్రబలుతుందని వైద్యులు తెలిపారు. శ్వాసకోశాలలో వాపు, పుండ్లుగా రానుంది. పిల్లి, కుక్క తదితర పెంపుడు జంతువులను పెంచుకునేవారు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచించారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మనుషులకు ఎటువంటి ప్రమాదం లేదని, అయితే జాగ్రత్త వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది.



20న నగరానికి మోదీ



- 24న ఉడుపికి యోగి ఆదిత్యనాథ్

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి రానున్నారు. ఈనెల 20న శనివారం చిక్కబళ్ళాపుర, బెంగళూరులలో అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చిక్కబళ్ళాపురకు చేరుకునే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగసభలో పాల్గొంటారు. చిక్కబళ్ళాపుర, కోలారు నియోజకవర్గాల అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో జరిగే బెంగళూరు ఉత్తర, సెంట్రల్, బెంగళూరు దక్షిణ, బెంగళూరు గ్రామీణ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. కాగా ఈనెల 24న తుమకూరు, చిత్రదుర్గ నియోజకవర్గాల్లో పర్యటించే అవకాశం ఉంది. అయితే 26న పోలింగ్ జరుగుతుండడంతో 24న ప్రచారానికి చివరి రోజు కానుంది. చివరి రెండు రోజులు అన్ని పార్టీలు ప్రచారంలో జోరు పెంచనున్నాయి. బీజేపీలో జాతీయ నేతల రాక మరింత పోటెత్తనుంది. ఇప్పటివరకు చిత్రదుర్గ, తుమకూరు అభ్యర్థుల తరఫున ప్రచారం చేసే షెడ్యూల్ ఖరారు కాలేదు.

కాగా ఈనెల 24న ఉడుపి-చిక్కమగళూరు అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి తరఫున ప్రచారం కోసం ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ విచ్చేయనున్నారు. రోడ్ షోతో పాటు ఓ సభలో యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు. కాగా మరో వారం రోజుల్లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రచారం కోసం వస్తున్నారని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.




జన కేతనం
ఆంధ్రజ్యోతి



రాష్ట్రంలోనే హిందూపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. నాటి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో కల్లూరు సుబ్బారావు లాంటి ఎందరో యోధులు ఈ ప్రాంతం నుంచి పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న హిందూపురం ప్రాంతానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇక్కడ ఆ పార్టీకి తిరుగులేని విజయాలు అందించింది. ఈ నియోజవర్గంలో టీడీపీకి అపజయమే లేదు. ఎన్టీఆర్ నుంచి నందమూరి బాలకృష్ణ వరకూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేసిన కృషి ఎనలేనిది.

- స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేకత
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఎమ్మెల్యేలు
- తొలి ఎమ్మెల్యే శివశంకర్ రెడ్డి
- టీడీపీ ఆవిర్భావం నుంచి కంచుకోట
- ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్
- పెన్నా, చిత్రావతి ఉన్నా.. నీటి కష్టాలే
- హంద్రీనీవాతో పునరుజ్జీవం
- గొల్లపల్లితో తాగునీటి సమస్య పరిష్కారం



లేపాక్షిలో జటాయువు

నియోజకవర్గ చరిత్ర


పోరాట పురం

హిందూపురం

భారత స్వాతంత్ర పోరాటంలో హిందూపురం ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. మహాత్మాగాంధీ పిలుపుతో ఎంతో మంది యువకులు స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డారు. ఈ పోరాటంలో రాయలసీమ నుంచి ముఖ్యంగా విని పించే పేరు కల్లూరు సుబ్బారావు. ఇంతటి మహోన్నత వ్యక్తి హిందూపురం నుంచి 1955లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. బ్రిటీష్ పాలనలోనే హిందూపురం తాలూకాగా ఏర్పడింది. హిందూరావు అనే పాలకుడి నుంచి హిందూపురం పేరు వచ్చింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న సమయంలోనే 1937, 1946లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ నుంచి డి. కదిరప్ప, కల్లూరు సుబ్బారావు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. పురం వాణిజ్య కేంద్రంతోపాటు కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఎక్కువ భాగం ఆ సంస్కృతి కనిపిస్తుంది.

మద్రాసు రాష్ట్రంలోనే పురం నుంచి శాసనసభ్యులు

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1937, 1946లో హిందూపురం నుంచి శాసన సభ్యులుగా డి.కదిరెప్ప, కల్లూరు సుబ్బారావు ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నియోజక వర్గం ఏర్పడిన 1952లో తొలి సారిగా స్వతంత్ర్య అభ్యర్థిగా శివశంకర్‌రెడ్డి గెలుపొందారు. 1957లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర సమర యోదుడు కల్లూరు సుబ్బారావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో హిందూపురం మున్సిపాలిటీతోపాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి.


కల్లూరు సుబ్బారావు


లేపాక్షి నంది విగ్రహం

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
2019	నందమూరి బాలకృష్ణ	టీడీపీ	షేక్ మహ్మద్ ఇక్బాల్	వైసీపీ	17,028
2014	నందమూరి బాలకృష్ణ	టీడీపీ	బి. నవీన్‌నిశ్చల్	వైసీపీ	16,196
2009	అబ్దుల్ ఘనీ	టీడీపీ	బి. నవీన్‌నిశ్చల్	ఇండిపెండెంట్	8,764
2004	రంగనాయకులు	టీడీపీ	బి.నవీన్‌నిశ్చల్	కాంగ్రెస్	7,363
1999	సీసీ వెంకటరాముడు	టీడీపీ	కె.తిప్పేస్వామి	కాంగ్రెస్	38,391
1996	నందమూరి హరికృష్ణ	టీడీపీ	లక్ష్మీనారాయణరెడ్డి	కాంగ్రెస్	58,210
1994	ఎన్టీ రామారావు	టీడీపీ	జేసీ ప్రభాకర్‌రెడ్డి	కాంగ్రెస్	60,050
1989	ఎన్టీ రామారావు	టీడీపీ	జి. సోమశేఖర్	కాంగ్రెస్	23,995
1985	ఎన్టీ రామారావు	టీడీపీ	ఈ. ఆదిమూర్తి	కాంగ్రెస్	40,529
1983	రంగనాయకులు	టీడీపీ	కె. తిప్పేస్వామి	కాంగ్రెస్	26,855
1978	కె. తిప్పేస్వామి	కాంగ్రెస్ ఐ	నాగభూషణ్‌రెడ్డి	జేఎన్‌పీ	21,360
1972.	జి. సోమశేఖర్	కాంగ్రెస్	తంబి వెంకటరత్నం	బీజేఎస్	21,840
1967	కాట్నగంటి	ఇండిపెండెంట్	కెఆర్‌హెచ్ రెడ్డి	కాంగ్రెస్	2,326
1965	కేఎస్ రావు	కాంగ్రెస్	ఆర్. దాసా	ఇండిపెండెంట్	4,614
1962	కె. రామక్రిష్టారెడ్డి	ఐఎన్‌డీ	కల్లూరు సుబ్బారావు	కాంగ్రెస్	8,759
1957	కల్లూరు సుబ్బారావు	కాంగ్రెస్	రుక్మిణిదేవి	ఐఎన్‌సీ	2,849
1952	శివశంకర్‌రెడ్డి	స్వతంత్ర			

చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలు

హిందూపురం నియోజకవర్గంలో పలు చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో ప్రపంచ శిల్పకళా క్షేత్రం లేపాక్షి, భారతదేశంలోనే చలివెందులలో అతి పెద్ద శాసనం, కొడికొండ కోట, కనుమ లక్ష్మీనరసింహస్వామి, పేట వెంకటరమణస్వామి ఆలయం, సూగూరు ఆంజనేయస్వామి ఆలయం, అనంత పద్మనాభ ఆలయం, వలస పక్షుల విడిది వీరాపురం ముఖ్యమైనవి.

తెలుగుదేశం పార్టీకి కంచుకోట



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురం అసెంబ్లీ స్థానం కంచుకోటగా నిలుస్తోంది. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఒకసారి ప్రతిపక్ష నాయకుడిగా ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహించారు. 1983 నుంచి 2019 వరకు టీడీపీ అభ్యర్థులే గెలుస్తున్నారు. హిందూపురం మున్సిపాటిలో టీడీపీ రెండు సార్లు మినహా గెలవలేకపోయినా ఎమ్మెల్యే ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులే గెలుస్తున్నారు. ఆరుసార్లు నందమూరి వంశానికి చెందిన వారే గెలిచారు ఇందులో మూడు సార్లు ఎన్టీఆర్, ఆయన తనయులు హరికృష్ణ ఒకసారి ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

యువ ఓటర్లే కీలకం



రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు కల్గిన హిందూపురంలో యువ ఓటర్లే కీలకంగా ఉన్నారు. నియోజకవర్గంలో 2,48,137 మంది ఓటర్లు ఉండగా మహిళలు 1,23,899, పురుషులు 1,24,219, ఇతరులు 19 మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు కల్గిన 4,666 మంది ఓటర్లు, 20నుంచి29 వయసు వారు 43,295 మంది, 30నుంచి39 వయసు వారు 65,951 మంది, 40 నుంచి 49 మధ్య 55,916 మంది, 50నుంచి59 వరకు 38,737 మంది, 60నుంచి69 మధ్య 23,926 మంది, 70నుంచి79 మధ్య 12,098 మంది, 80నుంచి89 మధ్య 3,278 మంది, 90నుచి99 మధ్య వయసు కలిగిన వారు 467 మంది ఉన్నారు. ఇందులో ప్రధానంగా యవత, మధ్య వయస్సు కల్గిన ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. ఇక్కడి అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించడంలో యువ ఓటర్లే కీలకం కానున్నారు.



సరదా సిత్రం


ఈ ఫొటోలో ఉన్నది ధర్మవరం కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, తాడిపత్రికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్. సత్యకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ధర్మవరంలో పర్యటించారు. ప్రసాద్ కూడా ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు. సిద్దయ్యగుట్ట ప్రాంతంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద 'అన్నా.. నాతో సెల్ఫీ దిగండి..' అని సత్యకుమార్‌ను ప్రసాద్ కోరారు. దీంతో 6.7 అడుగుల ఎత్తున్న ప్రసాద్‌ను సత్యకుమార్ ఎగాదిగా చూశారు. 'నీ ఎత్తుకు సరిపోయేలా ఫొటో దిగాలంటే... జెస్ట్ వెయిట్..' అంటూ నవ్వుతూ కారు స్టాండుపై నిలబడ్డారు. అలా ప్రసాద్‌తో సత్యకుమార్ ఫొటో దిగారు. ఈ సన్నివేశాన్ని చూసి అక్కడున్న వారంతా సరదాగా నవ్వుకున్నారు.

- ధర్మవరం


గొల్లవాండ్లపల్లి

సెంటిమెంటు..!

అనగనగా ఒక ఊరు..!


గంగమ్మ ఆలయం

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే సమయంలో చాలామంది మంచి ముహూర్తం చూసుకుంటారు. అచ్చొచ్చిన ఊరు, ఆలయం, సెంటర్.. ఇలా ఏదో ఒకటి ఎంచుకుంటారు. అలాంటి ప్రాంతాల్లో ఒకటి.. చెన్నేకొత్తపల్లి మండలంలోని గొల్లవాండ్లపల్లి గ్రామం. ఈ ఊరి నుంచి ప్రచారం ప్రారంభిస్తే ఎన్నికల్లో కలిసొస్తుందని దశాబ్దాలుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. అప్పట్లో పెనుకొండ నియోజకవర్గంలో ఉన్న ఈ ఊరు.. ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలో ఉంది. ఇప్పటికీ ఎన్నికల సెంటిమెంట్ కొనసాగుతోంది. అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థులు గ్రామంలో వెలసిన గంగమ్మ దేవతను దర్శించుకుని, పూజలు నిర్వహించుకుని ప్రచారాన్ని మొదలు పెడతారు. చెన్నేకొత్తపల్లి మండలంలో.. ఈశాన్య మూలలో(దేవుని మూల) ఈ ఊరు ఉండటం కూడా సెంటిమెంట్‌కు కారణమని ఆ ఊరి పెద్దలు చెబుతున్నారు.

- చెన్నేకొత్తపల్లి

రేపు బాలయ్య నామినేషన్



హిందూపురం, ఏప్రిల్ 17: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి హిందూపురం అభ్యర్థి నందమూరి బాలకృష్ణ ఈనెల 19న నామినేషన్ వేయనున్నారు. 19న మధ్యాహ్నం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నామినేషన్ దాఖలు చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. అదే రోజు సాయంత్రం 4 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాకు ముగ్గురు వ్యయపరిశీలకులు

పుట్టపర్తి, ఏప్రిల్ 17: జిల్లాలో ఎన్నికల వ్యయాలను పరిశీలించేందుకు ముగ్గురు అధికారుల బృందం వచ్చినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. హిందూపురం పార్లమెంటుకు అమిత్‌కుమార్, మడకశిర, హిందూపురం, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు వినాయక్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరికి శ్రీరిదయం బహదజా వ్యయ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం/అనంతపురం క్రైం, ఏప్రిల్ 17: ఎన్నికల నేపథ్యంలో సెబ్ అధికారులు, పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లేపాక్షి మండలం కంచిసముద్రం వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇన్నోవాలో 30 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. మద్యం, కారును సీజ్ చేసి చేశారు. మద్యాన్ని తరలిస్తున్న సోమందేపల్లి మండలం పందిపర్తికి చెందిన ఇమాంసాహెబ్, యల్లప్పగారి రామాంజినేయులును అరెస్ట్ చేశారు.

- హిందూపురం నుంచి మానెంపల్లికి వెళ్లే రహదారిలో బైక్‌పై తరలిస్తున్న ఐదు కర్ణాటక మద్యం బాక్సులను సీజ్ చేశారు. హిందూపురానికి చెందిన బాబు అనే వ్యక్తిని అరెస్టు చేశామని సెబ్ అదనపు ఎస్పీ నాగభూషణం తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్, ఎస్ఐలు కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.
- అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు బుధవారం రూ.9.25లక్షల నగదును సీజ్ చేశారు. 44వ నంబరు జాతీయ రహదారిపై.. రవి పెట్రోల్ బంక్ వద్ద సీఐ ప్రతాప్‌రెడ్డి సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారి ప్రశాంత్ నుంచి రూ.9.25 లక్షల ఆధారాలు లేని నగదును స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు.

పరిశ్రమలు, వ్యవసాయమే జీవనాధారం



హిందూపురం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంది. ప్రధానంగా అటు పెన్నా, ఇటు చిత్రావతి మధ్యలో జయమంగళి, కుషావతి నదులు ఉన్నా తాగు, సాగు నీటి కష్టాలు ఉన్నాయి. రెండు దశాబ్దాల కిందట నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో పాడిపంటలు కనుచూపుల మేర కలిపించేవి. ఏడాది పొడవునా భారీగా పంటల సాగు వల్ల పరిగి వద్ద చెరకు పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారు. తీవ్ర వర్షాభావంతో నదులు ఎండిపోవడంతో హిందూపురానికి సూపర్‌స్పిన్నింగ్ మిల్లుల రాకతో పరిశ్రమలకు బీజం పడి 1985లో ఎన్టీఆర్ తూమకుంట పారిశ్రామిక వాడకు శ్రీకారంతో దేశంలో అగ్రగామి వాడగా గుర్తింపు వచ్చింది. పారిశ్రామిక వాడలో 150కుపైగా పరిశ్రమలతోపాటు గార్మెంట్స్, పవర్‌లూమ్స్ పరిశ్రమలు నిర్మాణంతో సగటున 50 వేల మందికి ఉపాధి లభిస్తోంది. వీటితో ఇక్కడ ఉన్న చింతపండు, మిర్చి మార్కెట్లు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇక్కడి నుంచి చింతపండు, మిర్చి దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పట్టుపరిశ్రమకు అనుకూలమైన ప్రాంతం కావడంతో ప్రతి గ్రామంలో పట్టుపండించే రైతులు కనిపిస్తారు.

నియోజకవర్గ విస్తీర్ణం

హిందూపురం పట్టణంతోపాటు హిందూపురం మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం 54,389హెక్టార్లు కాగా ప్రస్తుత జనాభా 3,55,146 ఇందులో పురుషులు 1,79,192, మహిళలు 1,75,954 మంది ఉన్నారు.

ఓటర్ల వివరాలు

హిందూపురంలో పురుషులు 55,483, మహిళలు 53,874, ఇతరులు 9మంది ఉన్నారు. లేపాక్షిలో పురుషులు 16,593, మహిళలు 15,922, చిలమత్తూరులో పురుషులు 20,014, మహిళలు 19,487, ఇతరులు 1 మొత్తం ఓటర్లు 2,19,012 మంది ఉన్నారు. నియోజక వర్గంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 256 ఉన్నాయి.

గొల్లపల్లితో నీటి సమస్యకు చెక్

దశాబ్దాలకాలంగా హిందూపురంలో తాగునీటి సమస్య వెంటాడేది. తర్వాత రూ. 650కోట్లు వెచ్చించి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా హిందూపురానికి నీటిని తీసుకొచ్చారు. కానీ నాసిరకం పైపులు కావడంతో తరచూ నీటి సమస్య అలాగే ఉండేది. ఈ పరిస్థితుల్లో 2018వరకు గుక్కెడు నీటి కోసం పుర ప్రజలు రోడ్డెక్కేవారు. ఈ సమస్యను కళ్లారా చూసినా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెప్పి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ద్వారా నిధులను తీసుకొచ్చి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రూ.194కోట్లు వెచ్చించి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా హిందూపురానికి నీరు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఇక్కడ నీటి సమస్యకు చెక్‌పడింది. దీంతో దశాబ్దాల నీటి సమస్యకు తెలుగుదేశం పార్టీ పరిష్కార మార్గం చూపింది.

పెన్నా, చిత్రావతి ఉన్నా.. నీటి కష్టాలే


పురం మార్కెట్‌లో చింతపండు

హిందూపురం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంది. ప్రధానంగా అటు పెన్నా, ఇటు చిత్రావతి మధ్యలో జయమంగళి, కుషావతి నదులు ఉన్నా తాగు, సాగు నీటి కష్టాలు ఉన్నాయి. వెయ్యి అడుగుల లోతులో బోరు బావి తవ్వినా నీటి చెమ్మదొరకని పరిస్థితి ఉంది. హిందూపురం పట్టణంలో గత పదేళ్లుగా పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది. తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హంద్రీనీవా మడకశిర ఉప కాలువతో లేపాక్షి, హిందూపురం మండలాల్లో చెరువులను కృష్ణా జలాలతో నింపుతున్న నేపథ్యంలో సాగు,తాగు నీటి కష్టాలు కొన్ని గ్రామాల్లో పరిష్కారం దిశగా వస్తోంది. చిలమత్తూరు మండలం అంతటా గుక్కెడు తాగునీటి కోసం అగచాట్లు పడాల్సివస్తోంది. చిలమత్తూరు మండలంలో పరిశ్రమల కోసం రైతుల నుంచి 8,844 ఎకరాలను తీసుకున్న భూముల్లో 15 ఏళ్లుగా పరిశ్రమలు ఏర్పాటు కాకపోగా భూములు ఇచ్చిన రైతులు వలస కడుతున్నారు. హిందూపురంలో ఇరుకు రహదారుల వల్ల భారీ ట్రాఫిక్‌తో అంతరాయం వల్ల చుట్టూ రింగ్‌రోడ్ నిర్మించాల్సి ఉంది. పారిశ్రామిక వాడలో మూతపడిన పరిశ్రమలను పునఃప్రారంభించి స్థానికులకు ఉపాధి అవకాలు ఇవ్వాలనే డిమాండ్లు ఉన్నాయి.

ప్రధాన సంస్థలు

విద్య, వైద్యం, పరిశ్రమలు, వాణిజ్య మార్కెట్లతోపాటు తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడ, నవోదయ విద్యాలయం, గురుకుల పాఠశాలలు, తెలుగు చేనేత శిక్షణ కేంద్రం, కిరికెర పట్టుపరిశోధన ఉత్పత్తి కేంద్రం ఉన్నాయి.

అంతా రెడీ!

- నామినేషన్ల ఘట్టానికి ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీ అభ్యర్థులకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- అసెంబ్లీలకు ఆయా నియోజకవర్గాలలో నామినేషన్లు
- మూడు వాహనాలు, ఐదుగురికే అనుమతి
- దరఖాస్తుకు డాక్యుమెంట్లు తప్పనిసరి

అనంతపురంటౌన్/ ఉరవకొండ, ఏప్రిల్ 17

పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. పబ్లిక్ హాలిడేస్ మినహా మిగిలిన రోజులలో ఈనెల 25వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల కార్యక్రమానికి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అనంతపురం జిల్లాలో ఒకపార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలో నామినేషన్లు స్వీకరిస్తారు. ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టరు స్వీకరిస్తారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్ ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ పక్రియ కొనసాగుతోంది. ప్రతి అభ్యర్థి ఎన్నికల్లో రూ.40లక్షలకు మించి ఖర్చు పెట్టనని డిక్లరేషన్ ఇవ్వాలి. నామినేషన్ దాఖలు కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే ర్యాలీలు, ప్రదర్శనలు ఆపేయాలి.

అభ్యర్థులూ..! జాగ్రత్త

భారత ఎన్నికల సంఘం నామినేషన్ దాఖలకు మార్గదర్శకాలు జారీ చేసింది అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో అడిగిన సమాచారాన్ని పూరించాలి. ఆస్తుల వివరాలు, నేరచరిత్ర, కేసులు, ఇతర వివరాల సమాచారాన్ని జాగ్రత్తగా నింపాలి.

డాక్యుమెంట్లు తప్పనిసరి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్లు వేసే అభ్యర్థులు 13రకాల డాక్యుమెంట్లును దరఖాస్తుకు జత చేయాల్సి ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు చెప్పిన మేరకు డాక్యుమెంట్లు ఇలా ఉండాలి.

- పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసే వ్యక్తి భారతదేశ పౌరుడై ఉండాలి. అసెంబ్లీకి పోటీ చేసే వ్యక్తి రాష్ట్ర పౌరుడై ఉండాలి.
- ఎంపీ అభ్యర్థి దేశంలో ఎక్కడైనా పార్లమెంటు పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి, అసెంబ్లీ అభ్యర్థి రాష్ట్రంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలి
- పోటీ చేసే అభ్యర్థులకు కనీస వయసు 25 ఏళ్లు ఉండాలి
- పార్లమెంటు అభ్యర్థులు ఫారం-2ఏ, అసెంబ్లీ అభ్యర్థుల ఫారం-2బీ నామినేషన్ పత్రాలు ఇవ్వాలి
- ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు. నేరుగా వచ్చి నామినేషన్లు వేయవచ్చు. లేకుంటే ఆన్‌లైన్‌లో సువిధ పోర్టల్ ద్వారా కూడా నామినేషన్లు దాఖలు చేయవచ్చు.
- అఫిడవిట్ ఫారం-26, ఓటరుకార్డురోల్ నెంబరు, ఫారం-ఏ,బీ, కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి
- ఎంపీ అభ్యర్థులైతే రూ25,000, ఎమ్మెల్యే అభ్యర్థులైతే రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

నామినేషన్ల సందర్భంగా భారీ భద్రత

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండటంతో జిల్లా ఎన్నికల ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అభ్యర్థులు నామినేషన్లు వేసే సందర్భంలో పాటించాల్సిన నిబంధనల గురించి ఇప్పటికే కలెక్టరు, ఎస్పీ, ఆర్‌ఓలు వివరించారు. నామినేషన్లు స్వీకరించే కార్యాలయాల వద్ద 144 సెక్షన్ ప్రకటించి, అక్కడ ప్రత్యేక పోలీస్ బల గాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల కమిషన్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా లైవ్ ఏర్పాటు చేశారు. పోటీ చేసే అభ్యర్థి మూడు వాహనాలలో మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి రావడానికి అనుమతి ఉంది. అలాగే అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి వెళ్ల డానికి అనుమతి ఉంటుంది.

నియోజకవర్గం, నామినేషన్లు స్వీకరించే ప్రాంతం, రిటర్నింగ్ ఆఫీసర్, ఫోన్ నెంబరు			
రాయదుర్గం	తహసీల్దార్ కార్యాలయం	కరుణకుమారి	98499 09062
గుంతకల్లు	ఆర్డీఓ కార్యాలయం	శ్రీనివాసులురెడ్డి	98493 99611
ఉరవకొండ	తహసీల్దార్ కార్యాలయం	కేతన్‌గార్గ్	94931 88811
తాడిపత్రి	తహసీల్దార్ కార్యాలయం	రాంభూపాల్ రెడ్డి	6301228661
శింగనమల	తహసీల్దార్ కార్యాలయం	వెన్నెల శ్రీను	94942 14212
అనంతపురం	ఆర్డీఓ కార్యాలయం	గ్రంధి వెంకటేష్	94931 88807
కళ్యాణదుర్గం	ఆర్డీఓ కార్యాలయం	రాణిసుష్మిత	83330 82895
రాప్తాడు	తహసీల్దార్ కార్యాలయం	వసంతబాబు	94905 17883

నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి ఈనెల 25వరకు చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేస్తామని అన్నారు. జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఇతరులను లోపలికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు అన్ని ఆంశాలను వివరించాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ల పత్రాలు నింపడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన రామనామం..



బసవనపుర అభయాంజనేయస్వామి



సింధూర అలంకరణలో ఆంజనేయస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రీ రామ నవమి సంబరాలు సాగాయి. రామమందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే ప్రతిచోటా సందడి నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. పలు చోట్ల సీతారామ కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాలోపాటు ప్రతి వీధిలోనూ మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. భజన మండలులచే రామనామ సంకీర్తన ఏర్పాటు చేశారు. నగరంలోని మైసూరు రోడ్డు గాలి ఆంజనేయస్వామి ఆలయంలో మూల విరాట్టుకు విశేషపూజలు నిర్వహించారు. దొమ్మలూరు కోదండ రామేశ్వర ఆలయంలో బ్రహ్మరథోత్సవం సాగింది. గొట్టిగెరెలోని పవమాననగర్‌లో కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, సీతారామ పల్లకీ ఉత్సవాలు జరిపారు. దాసనపురలో ప్రసన్న బాలాంజనేయస్వామి ఆలయంలో సీతారామ తిరు కల్యాణోత్సవం, లాజ హోమం, అరిశిన కుంట ఆంజనేయస్వామి ఆలయంలో భజనమండలిచే ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి. హొసకెరెహళ్ళిలో పూజలు, అన్న సంతర్పణ కొనసాగింది. ఆనేకల్ తాలూకా హారగద్దె ఆలయంలో నవమి వేడుకలు ప్రత్యేకంగా సాగాయి. కత్రిగుప్పె రామాలయంలో సుప్రభాత సేవ నుంచి మహా మంగళారతి దాకా వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. చామరాజపేటలోని హనుమాన్‌మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర : ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో కోదండరామస్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఉదయం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మజ్జిగ, పానకం, పెసరబేడల పంపిణీ సహా అన్నదానం నిర్వహించారు. శ్రీరామ్‌రేఖా కోలాట బృందంచే సాగిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీరామభక్తమండలిచే సాయంత్రం అఖండ భజన సాగింది.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట : శ్రీరామనవమిని పురస్కరించుకుని శిడ్లఘట్ట పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా శ్రీరామ మందిరం, ఆంజనేయస్వామి ఆలయాలలో బుధవారం విశేష పూజలు సాగాయి. యోగి నారాయణ యతీంద్ర రోడ్డులోని బలిజసేవా ట్రస్టు ఆధ్వర్యంలోని వీరాంజనేయస్వామి, కైవారనారాయణ తాతయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం బయట మధ్యాహ్నం ఉట్లు ఉత్సవం, జాతర సాగింది. ఉదయం నుంచే ఆలయాల వద్ద సందడి నెలకొంది. రామతారక హోమం నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6 గంటలకు వీరాంజనేయస్వామి పల్లకీ ఉత్సవం పుర వీధులలో ఉత్సాహంగా సాగింది. పలు కూడళ్లలో మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

మహదేవపురలో...

మహదేవపుర : శ్రీరామనవమిని పురస్కరిం చుకుని పలు ఆలయాలలో బుధవారం విశేషపూజలు కొన సాగాయి. బసవనపుర గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ సహా అన్నసంతర్పణ నిర్వహించారు. ఇదే తొలిసారిగా అభయాంజనేయస్వామి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. బసవనపుర, స్వతంత్రనగర, గాయత్రి లేఅవుట్, అయ్యప్పనగర్ తదితర వీధులలో ఊరే గింపు సాగింది. ఆలయ ధర్మకర్త వెంకటేశ్, గ్రామస్థులు ఎల్ మునిస్వామి, గంగాధర్, వీ మంజునాథ్ సుబ్రమణి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో

బంగారపేట : పట్టణంలోని కోదండరామ స్వామి ఆలయం వద్ద జై హనుమాన్‌సేన, ఫ్రెండ్స్ చారిట బుల్ ట్రస్టు సంయుక్తంగా శ్రీరామనవమిని పురస్కరిం చుకుని విశేషపూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. హనుమాన్‌సేన కార్యదర్శి హుణసనహళ్ళి వెంకటేశ్ మాట్లాడుతూ.. శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరామచంద్రుడు చైత్రమాసం శుక్లపక్షంలో నవమి రోజున జన్మించారన్నారు. ధర్మాన్ని ఆచరించి చూపిన యుగ పురుషుడన్నారు. పితృవాక్య పాలకుడు, చక్కటి ప్రజాపాలన, కర్తవ్యం, గౌరవం, ఏకపత్నీ వ్రతం, సోదరప్రేమ, ఇలా ఎన్నో విధాలా నేటికీ ఆదర్శప్రాయమన్నారు. జై హనుమాన్‌సేన అధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ.. శ్రీరామనవమి పండుగ ఉద్దేశం చెడుపై మంచి విజయమేనన్నారు. ధర్మసంస్థాపనయే లక్ష్యమన్నారు. సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించామన్నారు. ఇదే తొలిసారిగా 3వేల కొబ్బరి బోండాలు, పానకం, మజ్జిగ, పెసరబేడలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మారుతి ప్రసాద్, హుణసనహళ్ళి సతీశ్, హుళుదేనహళ్ళి వెంకటేశ్, మణి, నవీన్, మధుసూదన్, రామప్రసాద్, లీలావతి, గౌరవాధ్యక్షుడు శివణ్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి పల్లకీ ఉత్సవం

చింతామణి : పట్టణ శివారులోని కన్నంపల్లి గ్రామానికి చెందిన వీరాంజనేయ స్వామి, పంచముఖిస్వామి సన్నిధి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సీతారామ కల్యాణ ఉత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి పుష్పపల్లకీ ఉత్సవం నిర్వహించారు. సుప్రభాత సేవ, అష్టమి అలంకరణ, మహానివేదన, శాత్తుమొర్రై, మహామంగళారతి అనంతరం 10 గంటలకు బలిహరణ, సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణ, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. రాత్రిపూల పల్లకీ ఉత్సవంలో బ్యాండ్‌సెట్, నాదస్వర బృందాలు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్, మాళపల్లి లేఅవుట్ తదితర మార్గాల్లో ఊరేగింపు సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీరామ నామ సంకీర్తనలో భక్తులు



శిడ్లఘట్టలో ఉట్ల ఉత్సవం



దొమ్మసంద్రలో సీతారాములకు అలంకరణ



బంగారపేటలో హనుమాన్ భక్తులు



విజయపురలో ఆంజనేయస్వామి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయస్...

జ్వాలాముఖి (జయంతి)



ప్రముఖ రచయిత 'జ్వాలాముఖి' 1938 ఏప్రిల్ 18న మెదక్ జిల్లా ఆకారం గ్రామంలో జన్మించారు. అసలు పేరు వీరవెల్లి రాఘవాచార్య. కవి, నాస్తికుడు. భారత్ - చైనా మిత్రమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో దిగంబర కవులుగా పేరొందిన ఆరుగురు కవులలో జ్వాలాముఖి ఒకరు. విరసం సభ్యుడిగా కొనసాగారు. బాల్యానికి రక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వార్ధక్యానికి పరిరక్షణ కల్పించగల వ్యవస్థే సోషలిస్టు సమాజం అని విశదీకరించారు. దాశరథి రంగాచార్య పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2008 డిసెంబరు 4న కన్నుమూశారు.

ఏవీఎస్ రాజు (పుట్టినరోజు)



అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు 1937 ఏప్రిల్ 18న తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది పాలెంలో జన్మించారు. వ్యవసాయ కుటుంబం నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సంస్థ అధ్యక్షుడు వ్యాపార రంగంలో ఆయన కృషికి 'పద్మశ్రీ' పురస్కారం దక్కింది. హైదరాబాద్ నగరంలో నెక్లెస్ రోడ్డు, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ లాంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలు చేపట్టారు. కాగా 2007లో సత్యసాయిబాబాపై రాసిన పుస్తకం అతిపెద్ద జీవిత చరిత్రగా గిన్నిస్‌బుక్‌లో చోటు పొందింది.

బెంగ్ట్ రాబర్ట్ హోల్‌స్ట్రామ్ (పుట్టినరోజు)



ప్రపంచ ఆర్థికవేత్తలలో ఒకరైన బెంగ్ట్ రాబర్ట్ హోల్‌స్ట్రామ్ 1949 ఏప్రిల్ 18న ఫిన్లాండ్ దేశం హెల్సింకిలో జన్మించారు. మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఒలివర్ హార్ట్‌తో కలసి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ స్వీడన్ నుంచి ఎకనామిక్స్ సైన్సెస్‌లో 2016లో 'నోబెల్ మెమోరియల్ ప్రైజ్' అందుకున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. నోకియా బోర్డ్ డైరెక్టర్‌గా 1999 నుంచి 2012 వరకు కొనసాగారు. ప్రస్తుతం ఆల్టో యూనివర్సిటీలో బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు.

కేఎల్ రాహుల్ (పుట్టినరోజు)



కణ్ణూరు లోకేశ్ రాహుల్ 1992 ఏప్రిల్ 18న బెంగళూరులో జన్మించారు. కర్ణాటక నుంచి ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కేప్టెన్‌గా ఉన్నారు. మూడు ఫార్మాట్‌లలోనూ సెంచరీ చేసిన ఘనత ఆయనది. ఐపీఎల్ 2020లో అత్యధికంగా పరుగులు చేసినందుకు ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నారు. 2024 జనవరి నాటికి 17 ఇంటర్నేషనల్ సెంచరీలు చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో ద్వారకేశ్ అంత్యక్రియలు

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, నిర్మాత ద్వారకేశ్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపారు. బుధవారం హెచ్ఎస్ఆర్ లే అవుట్ నివాసం నుంచి పార్థివదేహాన్ని రవీంద్ర కళాక్షేత్రకు తీసుకొచ్చారు. ఉదయం 7.30 గంటలనుంచే పెద్ద ఎత్తున సందర్శకులు, అభిమానులు కడచూపుకోసం తరలివచ్చారు. సీఎం సిద్దరామయ్య పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు. అనంతరం ద్వారకేశ్‌తో అనుబంధాన్ని ముఖ్యమంత్రి మీడియాతో పంచుకున్నారు. ద్వారకేశ్ తమ ప్రాంతానికి చెందినవారని, బాల్యం నుంచి తనకు పరిచయమన్నారు. ఒకసారి బెంగళూరు నుంచి మైసూరుకు హెలీకాప్టర్‌లో కలసి వెళ్లామని ఎన్నో అంశాలపై చర్చించామన్నారు. ద్వారకేశ్ కన్నడ సినిమారంగానికి చేసిన సేవలు మరువలేమన్నారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా శాండల్‌వుడ్ ఎదుగుదలకు ఓ స్తంభంలా నిలిచారన్నారు. నటులు రమేశ్ అరవింద్, కిచ్చ సుదీప్, సుందర్‌రాజ్, మేఘనా రాజ్‌తోపాటు పెద్దసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అక్కడనుంచి ప్రత్యేక వాహనంలో చామరాజపేట టీఆర్ మిల్లు రుద్రభూమికి తరలించారు. అక్కడ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ద్వారకేశ్ పార్థివ దేహానికి పెద్ద కుమారుడు యోగేశ్ నిప్పుపెట్టారు. బ్రాహ్మణ సంప్రదాయానికి అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులు అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

మంత్రి ఆత్మహత్య చేసుకుంటే రూ.5కోట్లు..

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'మంత్రి శివానందపాటిల్ ఆత్మహత్య చేసుకుంటే రూ.5కోట్లు.. డీసీఎం డీకే శివకుమార్ అయితే రూ.50 కోట్లు పరిహారం ఇస్తా' బీజేపీ సీనియర్ నేత ఎమ్మెల్యే బసగౌడనపాటిల్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర చక్కెరశాఖ మంత్రి శివానందపాటిల్ పరిహారం కోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నిజమైన అన్నదాతలు ఇలాంటి చర్యలకు పాల్పడరని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే యత్నాళ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బెళగావిలో బుధవారం ఆయన పార్టీ కార్యకర్తల సభలో మాట్లాడుతూ రైతులంటే మంత్రికి కనీస గౌరవం లేదన్నారు. మంత్రి ఆత్మహత్య చేసుకుంటే రూ.5కోట్లు పరిహారమిస్తానని, మంత్రి వ్యాఖ్యలను సమర్థించిన డీసీఎం డీకే శివకుమార్ ఆత్మహత్య చేసుకుంటే రూ.50 కోట్ల పరిహారం ఇస్తానన్నారు. తన వద్ద అన్ని కోట్లు లేకున్నా రైతులనుంచి సేకరించి ఇస్తానన్నారు. రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపు అంటూ మండిపడ్డారు. శాసనసభలో ఇదే అంశంపై మంత్రి శివానంద పాటిల్‌కు సవాల్ చేశానన్నారు. బెళగావి జిల్లాలోని సతీశ్‌జార్కిహోళి 'హిందూ' పదం పట్ల అసభ్యంగా మాట్లాడారని అయితే ఎన్నికల వేళ ఆలయా లకు వెళ్లి పూజలు చేస్తారన్నారు. తొలుత శ్మశానాలలో వాహనాలకు పూజలు చేసిన సతీశ్‌జార్కిహోళి ప్రస్తుతం దేవాలయాలవైపు మళ్లారన్నారు. ఎన్నికల ఖర్చులకోసం చక్కెర ఫ్యాక్టరీల యజమానులనుంచి మంత్రి శివానంద పాటిల్ వసూళ్లకు దిగారని ఆరోపించారు.

సర్వేలపై నమ్మకం లేదు

- 20 స్థానాల్లో గెలుపు ఖాయం- మేకెదాటు సాధించేందుకే మంత్రినయ్యా
- 'మీట్ ది ప్రెస్'లో డీసీఎం డీకే శివకుమార్



డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సర్వేలపై నాకు నమ్మకం లేదు, కానీ లోక్‌సభ ఎన్నికల్లో 20 సీట్లు గెలుస్తామని డీసీఎం, కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్'లో భాగంగా బుధవారం పలు అభిప్రాయాలు పంచు కున్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలు నిరంతరమని మరో 9ఏళ్లు నిరాటంకంగా కొనసాగుతాయన్నారు. దేశంలో 'ఇండియా' కూటమిదే విజయమన్నారు. సర్వేలను ఎలా నమ్ముతామని కనీసం నియోజకవర్గానికి 50వేలమంది అభిప్రాయాలకు అనుగుణంగా ఉంటే విశ్వసించవచ్చన్నారు. దేశంలో సమైక్యతకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ శక్తి దేశశక్తి అన్నారు. బీజేపీ, జేడీఎస్‌లకు చెందిన ఎంతోమంది కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో బీజేపీ ఓటు అడిగే నైతికత కోల్పోయిందన్నారు. గత ఎన్నికల్లో వారిచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మేం ఐదు గ్యారెంటీలు హామీ ఇచ్చామని అమలు చేస్తున్నామని 1.20 కోట్లమంది మహిళలకు గృహలక్ష్మి అందుతోందన్నారు. ఇటీవలే ఓ విద్యార్థి గృహలక్ష్మి సొమ్ము తన చదువుకు ఉపయోగపడిందని ప్రకటించారని, ఓ సోదరి ఫ్రిజ్ కొందని, మరో సోదరి టెలివిజన్ కొనుగోలు చేసిన సందర్భంలో వారి సంతోషం చూశామన్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే లక్ష్యంతోనే ఆ శాఖ మంత్రిని అయ్యానన్నారు. మేకెదాటు విషయంలో బీజేపీ, జేడీఎస్‌లు సహకరించడం లేదన్నారు. మేం పోరాటం చేస్తే రూ.1000 కోట్లు కేటాయించారని, కానీ పర్యావరణశాఖ నుంచి అనుమతులు పొందలేదన్నారు. ఎవరెన్ని చెప్పినా మేకెదాటును నిర్మించి తీరుతామన్నారు. ఇప్పటికే కనకపురలో ప్రత్యేక కార్యాలయాన్ని తెరిచామన్నారు. తమిళనాడు దాఖలు చేసిన అఫిడవిట్‌లో అభ్యంతరం లేదని పేర్కొందని, కానీ అక్కడ అన్ని రాజకీయ పార్టీలు ఒకే నిర్ణయంతో వ్యతిరేకించడమే సమస్యగా మారిందన్నారు. మహదాయికి అనుమతులు దక్కాయని, శెట్టర్, బొమ్మైలు సంబరాలు చేశారని, ఎక్కడ సాధ్యం చేశారో చూపుతారా... అంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలను వేధించడమే వారి లక్ష్యమన్నారు. కర్ణాటక, తెలంగాణలో గ్యారెంటీలు ఫలించిన తర్వాత ప్రధానమంత్రి కూడా గ్యారెంటీలను తెరపైకి తెచ్చారన్నారు. ఓటమి తప్పదనే పొత్తులకు వెళ్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో సంబంధం లేని చంద్రబాబును చేర్చుకున్నారన్నారు.

బెళగావి ప్రదేశాలు మహారాష్ట్రలో చేరాలి...

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లాలోని పలు తాలూకాలు మహారాష్ట్రలో విలీనం కావాల్సి ఉందని ఉత్తర కన్నడ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి అంజలి నింబాల్కర్ వ్యాఖ్యలపై బీజేపీ ఎన్నికల నిర్వహణ సమితి సంచాలకులు సునిల్‌కుమార్ మండిపడ్డారు. బెళగావి పరిధిలోని ప్రాం తాలపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధ వారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సమైక్య కర్ణాటకకు ఎవరు భంగం కలిగిస్తున్నారనేది నిర్ధారణ కావాలన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని విడగొట్టడం, విద్వేషం రెచ్చగొట్టడమే కాంగ్రెస్ రహస్య అజెండగా ఉందనిపిస్తోందన్నారు. సీఎం సిద్దరామయ్య ఇటువంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధానసౌధలో పాకిస్థాన్ జిందా బాద్ నినాదాలు చేసినా ముఖ్యమంత్రి మౌనంగా ఉంటారని, రాష్ట్రా న్ని విభజించాలని అభ్యర్థి ప్రకటించినా మౌనమే అన్నారు. ఇక దేశా న్ని విభజించాలనుకోవడం వారి డిమాండ్ అంటూ మండిపడ్డారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

60మంది అభ్యర్థులు - 72నామినేషన్లు

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండో విడత లోక్‌సభ పరిధిలోని 14 లోక్‌సభ నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకోసం అభ్యర్థులు పోటీ పడ్డారు. బుధవారం 60మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. 55మంది పురుషులు 67 నామినేషన్లు, ఐదుగురు మహిళలు ఐదు నామినేషన్లు సమర్పించారు. అత్యధికంగా ఉత్తరకన్నడ నుంచి ఏడుగురు - 9నామినేషన్లు, బీదర్ నుంచి ఆరుగురు 6నామినేషన్లు, దావణగెరె నుంచి ఆరుగురు 6 నామినేషన్లు, దాఖలు చేయగా హావేరి నుంచి ఐదుగురు 7 నామినేషన్లు, ధారవాడ నుంచి ఐదుగురు 5 నామినేషన్లు వేశారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు




ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.78	1,576.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	162	251
సామర్థ్యం (టీఎంసీలు)	3.91	3.16

సీతారాముల కల్యాణం.. భక్తజనుల పరవశం





ప్రత్యేకాలంకరణలో సీతారాములు



షుగర్ ఫ్యాక్టరీలో ప్రత్యేకాలంకరణలో స్వామి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్



విద్యానగర్‌లోని అభయాంజనేయస్వామి



సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



తోరణగల్లు : ప్రత్యేకాలంకరణలో సీతారాములు



పూజల్లో పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్



తీర్థ ప్రసాద వితరణ

జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీరామ నామ జపంతో ఆలయాలు మారుమోగాయి. తరలివచ్చిన భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు. వ్యవసాయం నిమిత్తం వివిధ క్యాంపులు, గ్రామాలు, నగరాల్లో స్థిరపడిన ప్రజలు శ్రీరామనవమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సిరుగుప్ప రహదారిలోని రామనగర్‌లోని గట్టుపై కొలువుదీరిన కోదండరామ దేవస్థానంలో, నగరంలోని విద్యానగర్ అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరనగర్ వరదాంజనేయస్వామి, తేరువీధి రామస్వామి ఆలయం, ఆంధ్రాళు రామాలయం, కాకర్లతోట రామాలయం, కేసి. కొండయ్యనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, కృష్ణానగర్ క్యాంపు, అల్లీపురంలోని మహాదేవతాత మఠం, రామేశ్వరీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం, గవియప్ప కూడలిలో రామభజనమందిరంలోనూ రామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలకు తరలి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. కంప్లి చుట్టుపక్కల గ్రామాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల సీతారాముల కళ్యాణోత్సవం చేపట్టారు. కంప్లి పట్టణం, షుగర్ ఫ్యాక్టరీలో శ్రీరామనవమి సందర్భంగా కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

తోరణగల్లు తాలుకా వ్యాప్తంగా శ్రీరామనవమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఒడ్డు గ్రామంలోని ప్రసిద్ది చెందిన అల్లదిరాయ దేవస్థానంలో శ్రీ ఆంజనేయ స్వామికి, సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామి వారికి విశేష పూజలు చేసి ప్రత్యేకాలంకరణ చేశారు. బళ్లారి నగరంలోని విద్యానగర్ అభయాంజనేయస్వామి దేవాలయంతో పాటు వెంకటేశ్వర కాలనీలోని ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్ పాల్గొన్నారు. అభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అధ్యక్షులు ధనుంజయ నేతృత్వంలో సీతారాములకు కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.

✍ బళ్లారిసిటీ, రూరల్, కంప్లి, తోరణగల్లు

పంచభాషా నటుడు రాఘవ

78వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన వక్తలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బసవరాజు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 17: ఐదు భాషల నాటకాలలో నటించి అందులోని మెళకువలను ప్రపంచానికి వివరించిన గొప్ప నటుడు బళ్లారి రాఘవ అని రిటైర్డ్‌లెక్చరర్ ఎస్.బసవరాజు కొనియాడారు. బళ్లారి రాఘవ కళామందిరంలో మంగళవారం సాయంత్రం బళ్లారి రాఘవ 78వ వర్ధంతిని సంస్థ కార్యకర్తలు జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. ఈసందర్భంగా బసవరాజు మాట్లాడుతూ నాటక రంగంలో అద్వితీయ నటుడుగా బళ్లారి కీర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి బళ్లారి రాఘవ అని పేర్కొన్నారు. 1880లో జన్మించిన రాఘవ 1946 ఏప్రిల్ 16న హంపి పూర్ణిమ రోజున స్వర్గస్తులు కావడం విశేషమన్నారు. ఈసందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షులు చన్నప్ప, అధ్యక్షులు కోటేశ్వరావు, గౌరవ కార్యదర్శి ప్రకాశ్, ఉపాధ్యక్షులు రమేశ్‌గౌడపాటిల్, విష్ణువర్ధన్‌రెడ్డి, రామాంజినేయులు, అమరేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. తదనంతరం ధాత్రిరంగ సంస్థ సిరిగేరి బృందంచే మహంతేశ్ డైరెక్షన్‌లో 'సోరుతిహుదు సంబంధ' కన్నడ నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

కనుగోలు ఆమనికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ఆమని

బళ్లారి సిటీ, ఏప్రిల్ 17: ఎన్ఎం.ఐ.ఎం.ఎస్ ముంబై మానసిక శాస్త్రవిభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కనుగోలు ఆమనికి కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) లభించింది. ఆమె రాసిన వ్యాసం 'రోల్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఫంక్షన్స్ అండ్ పర్సనాలిటీ ట్రైట్స్ ఇన్ ఇంటరాగేటివ్ సజస్టిబిలిటీ ఆమాంగ్ అండర్ ట్రయర్ ప్రిజనర్స్' కర్ణాటక విశ్వవిద్యాలయం అధికారుల ఆమోదముద్ర పొందింది. ఆమని తన వ్యాసాన్ని కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లోని కర్ణాటక విశ్వవిద్యాలయం మానసిక విభాగం ఆమనికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆమె తల్లిదండ్రులు కనుగోలు శ్యామ్ సుందర్, తల్లికనుగోలు అరుణ, కటుంబం,బంధుమిత్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అభివృద్ధి అంటే హైవేలు మాత్రమేనా?

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 17: అభివృద్ధి అంటే మాల్స్,హైవేలు,పెద్దపెద్ద భవనాలు మాత్రమే కాదని సిఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. మానవులకు పోషకాహారం, సొంత ఇల్లు, జీవించడానికి ఉద్యోగం, పదవీ విరమణ తర్వాత కనీస పెన్షన్ ఉండాలన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్డీయే నేతృత్వంలోని ప్రభుత్వం సాధారణ ప్రజలకు, కార్మికులకు చట్టబద్ధమైన సంస్కరణల పేరుతో చట్టాలను మార్చిందన్నారు. ఆహారం, ఆరోగ్యం, విద్యను ప్రైవేటీకరించారన్నారు. శాశ్వత ఉపాధికి బదులు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పర్మినెంట్ అయిపోయిందన్నారు. స్వయం ఉపాధి కూలీలు ఎక్కువ మంది ఆదాయానికి హామీ లేకుండా, చాలా దుర్భరమైన జీవితాన్ని గడపవలసి వస్తోందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిని ఓడించాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎక్కువ అవినీతి చేశారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు.

బళ్లారి లోక్‌సభ స్థానానికి భారీగా నామినేషన్లు







ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న అరుణ్ హిరేహల్, జనశక్తిపార్టీ తరఫున మంజునాథ్ నామినేషన్, బహుజన పార్టీ కలంగల్ కృష్ణప్ప నామినేషన్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలు నాలుగో రోజు బుధవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అరుణ్ హిరేహాల్, పీ.జీపీ(ప్రహార జనశక్తిపార్టీ) నుంచి మంజునాథ్ ఘోసల్, బి.ఎస్పీ (బహుజన సమాజ్ పార్టీ) నుంచి కలంగల్ కృష్ణప్ప, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పంపాపతి నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్‌కు సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 12న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన సమయంలో నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారన్నారు. సోమవారం ఓ అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని సమర్పించారని, ఏప్రిల్ 16న ఎవరూ నామినేషన్ వేయలేదన్నారు. బుధవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారని, ఇప్పటి వరకు మొత్తం 9మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలుచేశారన్నారు. నామినేషన్ పత్రాల సమర్పణకు ఏప్రిల్ 19 చివరి రోజు అని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

పీజేపీ లోక్‌సభ అభ్యర్థి మంజునాథ్ నామినేషన్

బళ్లారిరూరల్: బళ్లారి నగరంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పహారా జనశక్తి పార్టీ లోక్‌సభ అభ్యర్థి మంజునాథ్ గోస్వామి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు అందించారు. అయనతో పాటు పీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, సమన్వయ కార్యకర్త ఎం శేషాద్రి, పీజేపీ నాయకులు గోవిందప్ప, రాజశేఖర్ పీఎం, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థి కొలగల్లు వాల్మీకి కిష్టప్ప

బళ్లారి నగరంలో బుధవారం బహుజన సమాజ్‌వాద్ పార్టీ (బీఎస్పీ) లోక్‌సభ అభ్యర్థి కొలగల్లు వాల్మీకి కిష్టప్ప బళ్లారిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మిశ్రాకు నామినేషన్ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ ఉత్సవారి మహమ్మద్ అలీ, జిల్లా అధ్యక్షులు హెచ్ మునుస్వామి పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి పంపాపతి

కాంగ్రెస్ వైపే ప్రజల చూపు..

- పార్టీకి 1999 నాటి వైభవం తథ్యం
- డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్

బళ్లారి,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, ఎంపీ ఎన్నికల్లో ప్రజల పూర్తి మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బళ్లారి జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ పేర్కొన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బళ్లారి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈ.తుకారాం విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విశ్వాసం నిలుపుకుందని తెలిపారు. ఐదు గ్యారెంటీలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. 1999 వరకూ బళ్లారి లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీకే ఉండేదని, తరువాత జరిగిన కొన్ని పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ ఓడిపోవాల్సివచ్చిందన్నారు. కానీ ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుందని తెలిపారు. తుకారాం సౌమ్యుడని, విద్యావంతుడని, ప్రజల కోసం పనిచేసే మంచివ్యక్తి అని అన్నారు. ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా తుకారాం గెలుస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 9 ఎమ్మెల్యే స్థానాల్లో 6 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, మిగిలిన చోట్ల జేడీఎస్, ఇండీపెంటెంట్, బీజేపీ వారు ఉన్నారన్నారు. ఇండిపెండెంటు కూడా కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేనే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు ఉన్నాయని, అందుకే కనీసం 15 స్థానాలకుపైగా గెలుస్తామనిపేర్కొన్నారు.

ఎద్దులబండ్లపై ర్యాలీ

కంప్లి, ఏప్రిల్ 17 : ఎమ్మిగనూరు గ్రామంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఎద్దులబండ్లపై శతమాన పాఠశాల నుంచి నోడల్ అధికారి శ్రీకుమార్ బుధవారం ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మిగనూరుతో పాటు వివిధ గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు శారద, ఉపాధ్యక్షురాలు గాదెలింగప్ప, మల్లన్నగౌడ, తారానాయక్, అనుమేష్, బసన్నగౌడ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కుడితిని పట్టణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ర్యాలీ నిర్వహించారు.

వ్యాధుల నివారణకు విస్తృత అవగాహన అవసరం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 17: సమాజానికి వైద్య సేవలు అందించి కొత్త రోగాలు ప్రబలకుండా సహాయక వాతావరణం కల్పించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కలబుర్గి డివిజనల్ అసోషియేషన్ డైరెక్టర్ డాక్టర్ అంబరాయ్ ఎస్, రుద్రవాడి అభిప్రాయపడ్డారు. నగరంలోని ఐఎంఏ హాల్లో జిల్లా వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'నాఆరోగ్యం నా హక్కు' నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకోవాలని ప్రతి ఏటా ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో కొత్తవ్యాధి వచ్చినప్పుడు ఆవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చికిత్సద్వారా వ్యాది నివారణకు మరింత సమాచారం అందించి దాని బారిన పండకుండా చూడాలన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాక కలబుర్గి డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ శరణప్ప గంజలఖేడ మాట్లాడుతూ మారిన జీవనశైలీ చెడు ఆహారపు అలవాట్ల వల్ల మదుమేహం, గుండెపోటు, డిప్రెషన్‌వంటి వ్యాధులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వ్యాయామం ఈత సైకిల్ తొక్కడం వంటి వాటిని అలవర్చుకుంటే రక్తపోటు రాకుండా నివారించవచ్చని తెలిపారు.

హోసూరు జోన్

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



హోసూరు, ఏప్రిల్ 17: శ్రీరామనవమిని పురస్కరించుకుని హోసూరు వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. నేతాజి రోడ్డులోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి అభిషేకం, అలంకరణ చేశారు. మధ్యాహ్నం మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కృష్ణగిరిరోడ్డులోని బండ ఆంజనేయస్వామి ఆలయంలోనూ విశేషపూజలు, భజనలు నిర్వహించారు. ఎంజీ రోడ్డులోని వినాయక ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విశేషపూజలు కొనసాగాయి. కెలమంగలం, డెంకణీకోట, బేరికై, బాగలూరు, తదితర ప్రాంతాల్లోని రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాల్లో విశేషపూజలు కొనసాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రసాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో

నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉత్సవాలకు సమితి అధ్యక్షుడు రామచంద్రన్ అధ్యక్షత వహించారు. అన్నయ్యప్ప, విశ్వనాథ్, ముత్తుకృష్ణన్, దయానాథం, రామస్వామిరెడ్డి పాల్గొన్నారు. సత్యనారాయణ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, పవిత్ర మనోహర్‌లు ప్రసంగిస్తూ రామతత్వాన్ని వివరించారు. రామాయణ విశిష్టతపై ప్రసంగించారు. భక్తాదులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

ఓటు హక్కుపై జాగృతి ర్యాలీ

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ఆవశ్యకత, వందశాతం ఓటింగ్ లక్ష్యంపై అధికారులు జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణగిరి ఏరియా కరడిగిరి గ్రామం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కెలమంగలం జిల్లా ఉలిమంగళం గ్రామంలోనూ ప్రజలకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. వేపనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దాసిరిపల్లి, భూదిముట్లు గ్రామంలోనూ జాగృతి ర్యాలీ సాగింది. హోసూరు మండలం సానచంద్రం గ్రామంలోని ఫ్యాక్టరీ కార్మికులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. కెలమంగలం పరిధిలోని బెదిరెడ్డి గ్రామంలోనూ, శూలగిరి పంచాయతీ యూనియన్ పరిధిలో కమ్యూనిటీ డెవలెప్‌మెంట్ అధికారులు పర్యటించారు.

రూ.5.28 లక్షల నగదు స్వాధీనం

హోసూరు, ఏప్రిల్ 17: హోసూరు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి రికార్డులు లేని రూ.5.28 లక్షల నగదు గుర్తించారు. హంబలగట్ట ప్రాంతం నుంచి హోసూరు సమీపంలో ఆనేకల్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి వాహనాన్ని తనిఖీ చేయగా భారీగా నగదును గుర్తించారు. అయితే ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న నగదు

ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు

రాయచూరు, ఏప్రిల్ 17 : ఎన్నికల ప్రక్రియ రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో ఊపందుకుంది. ఒకవైపు రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తుండగా మరోవైపు అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాయచూరు లోకసభ పరిధిలో 8 శాసనసభ నియోజక వర్గాలు ఉన్నాయి. ఇందులో ఐదు రాయచూరు జిల్లా పరిధిలోవి కాగా మరో 3 అసెంబ్లీ సెగ్మెంట్‌లు యాదగిరి జిల్లాలో ఉన్నాయి. 8 శాసనసభ సెగ్మెంట్‌ల పరిధిలో వచ్చే నెల మే 7వ తేదీన పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వేగంగా పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేసిన అధికారులు మరోసారి చివరి దశ శిక్షణకు సమాయత్తమవుతున్నారు. యాదగిరి జిల్లా పరిధిలోని శాహపూర్ నియోజక వర్గంలో 265, సురపుర(శోరాపుర) నియోజక వర్గంలో 317, యాదగిరి నియోజక వర్గంలో 268 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా రాయచూరు జిల్లాలోని రాయచూరు రూరల్ సెగ్మెంట్‌లో 275, రాయచూరు సిటీలో 250, మాన్వి సెగ్మెంట్‌లో 276, దేవదుర్గలో 267, లింగసుగూరులో 285 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పటికే ఆయా కేంద్రాలకు సరిపడ సిబ్బందిని నియమించారు. దీంతో పాటు రాయచూరు నియోజక వర్గం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న నేపథ్యంలో అధికారులు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీకి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు రెండు రాష్ట్రాల సరిహద్దు ఉన్న నేపథ్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి, చెక్‌పోస్టుల వద్ద తనిఖీతో పాటు కోడ్ ఉల్లంఘన జరగకుండా తీసుకోవల్సిన జాగ్రతల గురించి చర్చించి తగిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

కాగా ఈ నెల 19వ తేదీన నామినేషన్‌ల దాఖలుకు చివరి తేదీ కాగా ఇప్పటికే రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించగా నామినేషన్‌లు సహితం దాఖలు చేశారు. తిరిగి మరో సెట్ నామినేషన్ వేసేందుకు ఆయా అభ్యర్థులు సమాయత్తం అవుతుండగా ప్రచారాన్ని రెండు పార్టీలు ముమ్మరం చేశాయి. రాయచూరులో బీజేపీకి జేడీఎస్ మిత్రపక్షంగా ఉన్న నేపథ్యంలో రెండు పార్టీల నాయకులు సంయుక్తంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఒక వైపు ఎండవేడి తీవ్రతరమవుతున్న నేపథ్యంలో అంతే స్థాయిలో ఎన్నికల ప్రచారం కూడా తీవ్ర రూపం దాలుస్తుండడం విశేషం. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అన్ని నియోజక వర్గాల్లో ప్రచారాన్ని ఒక రౌండ్ పూర్తి చేయగా మరింత విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి

రాయచూరు, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమి పర్వదినాన్ని నగరంతో పాటు జిల్లాలోని అనేక చోట్ల బుధవారం ప్రజలు బక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఆదర్శ దంపతుల కల్యాణాన్ని కన్నుల పండుగగా తిలకించారు. స్టేషన్ రహదారిలో ఉన్న ప్రదాన రామాలయం కోదండరామ ఆలయంలో స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు.



ఊరేగింపులో పాల్గొన్న యువకులు,భక్తులు